


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 12 పుష్పం : 31-33 5-3-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 12

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 26-1-2003, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కోరిక విడిచిపెట్టండి, కోపం విడిచిపెట్టండి, భయం విడిచిపెట్టండి అని భగవంతుడు చెపుతున్నాడు. మనిషికి చాలారోగములు భయంలో నుండి వస్తున్నాయి, అది మీకు తెలియటంలేదు. భయం శరీరానికి ఉండదు, భయం మనస్సులో ఉంటుంది. మనస్సులోఉన్న భయం శరీరంమీద పడి అనేకరోగాలు వస్తున్నాయి. ఆత్మవిశ్వాసం పెంచుకోవటం వలన భయం తగ్గుతుంది. భగవంతుడి మీద నమ్మకం లేనివాడు నాస్తికుడు కాదు, మీ మీద మీకు విశ్వాసం లేకపోతే మీరు నాస్తికులు అని స్వామీజీ చెప్పారు. మీకు బంధువులు బలం ఉన్నా, ఆరోగ్యబలం ఉన్నా, అర్ధబలం ఉన్నా మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే మీరు జీవితంలో ఏదీ సాధించలేరు. డూనాట్ ఫియర్, గాడ్ ఈజ్ నియర్ అన్నారు స్వామీజీ. భగవంతుడు నీ వెంటఉంటే నీకు భయపడవలసిన పని ఏముంది. మంట ఎదురుగా ఉంటే చలి ఎంతఉన్నా భయం ఏమిటి అలాగే భగవంతుడు మీకూడా ఉన్నప్పుడు భయం దేనికి? భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే దేనికి భయపడవలసిన పనిలేదు. ప్రతి చిన్నవిషయానికి కోపం తెచ్చుకొంటూఉంటే జీవితంలో నష్టపోతారు.


**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

26-1-03 జిన్నూరు ........ 1
19-2-03 గణపవరం ........ 6
26-2-03 శివదేవునిచిక్కాల ........ 12




ఏ కర్రకు నిప్పు ఉంటే ఆ కర్రే కాలుతుంది, అలాగే ఎవడైతే ప్రతి చిన్నవిషయానికి కోపం తెచ్చుకొంటున్నాడో వాడు లోపల కాలిపోతూ ఉంటాడు, వాడికి శాంతి ఉండదు. హృదయం శాంతితో, ఆనందంతో తొణికిసలాడుతున్నప్పుడు అసలు కోరికే ఉదయించదు. నీ హృదయంలో ఉన్న అశాంతే, వెలితే కోరిక క్రింద వస్తుంది. మనలను మనం పరిశీలన చేసుకొంటే, పరిశోధన చేసుకొంటే మన గురించి మనం ఆలోచించుకొంటే అసలు మూలతలంపే లేదన్న సంగతి తెలుస్తుంది. ఉల్లిపాయకు ఉన్న పొరలు అన్నీ తీసివేస్తే ఉల్లిపాయలేదు అలాగే ఒకోతలంపు, ఒకోతలంపు తీసివేస్తే మూలతలంపు లేదు. భగవంతుడు గురించి, జ్ఞానం గురించి చెపుతూ ఉంటే ఎవడికయితే లోపల ఆనందం వస్తోందో వాడు మాత్రమే నిజమైన భక్తుడు. భగవంతుడు గురించి జ్ఞానం గురించి తప్పించి ఎవరైనా లోకవిషయాలు చెపుతూ ఉంటే మీకు సంతోషం వస్తూ ఉంటే మీరు భక్తులు కాదు అని అర్ధం. మనకంటే వేరుగా ఏదో ఉంది అనుకొన్నప్పడే మనకు కోరికలు పెరుగుతాయి, మనకు వేరుగా ఏదీలేదు. ఒక మనిషి మంచివాడు అని చెప్పటానికి ఇంకో మనిషి చెడ్డవాడు అని చెప్పవలసిన పనిలేదు. ఈమధ్య మాకు కష్టాలు వస్తున్నాయి అని కొంతమంది అంటున్నారు. కష్టాలు రాకపోతే వీక్‌మైండ్ స్ట్రాంగ్‌మైండ్ అవ్వదు. గాంధీగారు జీవితం పొడుగునా కష్టాలు పడ్డాడు, ఎన్నో అవమానాలు భరించాడు, అందుచేత ఆయన మహాత్ముడు అయ్యాడు. కష్టాలు మీకు పరీక్షలు వంటివి.పరీక్ష పాసైతే కదా మీరు హైయర్ క్లాస్‌కు వెళ్ళేది. మనకు వచ్చే తలంపుల విషయంలో ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం జ్ఞానాన్ని ప్రచారంచేస్తూ ఉంటే మనకు జ్ఞానం కలుగుతుంది. మనం అసూయను ప్రచారం చేస్తున్నాము అనుకోండి, మనం అసూయగ్రస్తులం అయి, మూలంలో కుళ్ళిపోతాము. మనం ఏది ఆలోచిస్తూ ఉంటే అదే అవుతాము. మీరు పనిని విడిచిపెట్టవద్దు. కాని మనకు గౌరవాలమీద ఉన్న ఇష్టం, డబ్బుమీద ఉన్న ఇష్టం, గోడలమీద పేర్లు వ్రాయించుకోవటం మీద ఉన్న ఇష్టం పనిమీద లేదు. పనిమీద మనకు గౌరవం లేదు. పనిచేయకుండా సంపాదన రావాలి, గౌరవం రావాలి అనుకోవటం మంచిది కాదు. పనిని ప్రేమించాలి. చేసేపని ఇష్టంగా, ప్రేమగా నిష్కామంగా చేయాలి. దేహప్రారబ్దాన్ని బట్టి భగవంతుడు మనకు ధనంఇస్తే అంతా మనమే తినేయకూడదు, కొంతభాగం ప్రజలకు ఖర్చుపెట్టాలి. మొత్తండబ్బు అంతామనమే ఖర్చుపెట్టుకొంటే మనలో భోగప్రవృత్తి పెరిగిపోతుంది. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా రెండూ కూడా స్వప్నంతో సమానము. అందుచేత ఎటువంటి పరిస్థితులలోను మీరు శాంతిని పోగొట్టుకోవద్దు. శాంతిలేనివాడికి సుఖంలేదు. అందుచేత అన్ని విధములుగా ప్రయత్నంచేసి మనం శాంతిని కాపాడుకోవాలి.

నా గురువు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది అని అడిగితే ధ్యానంవలన తెలుస్తుంది అని చెప్పారు. ఎవరిని స్మరించుకోవటం వలన నీ మనస్సుకు చల్లదనం కలుగుతుందో, ఎవరి సమక్షంలో నీకు వివేకం కలుగుతుందో వాడే నీకు గురువు. గురువు దయ వలన మనకు వివేకం కలుగుతుంది. తరువాత మన వివేకమే మనకు టీచ్ చేస్తుంది. మన వివేకమే మనకు గురువుగా ఉండి మనకు బోధించి మన జీవితాన్ని సరిదిద్దుతుంది. నిజమైన స్నేహితులు దొరకటం కూడా చాలా కష్టం. కొన్ని అపురూపమైన పక్షులు ఉంటాయి అలాగే కొంతమంది అపురూపమైన మనుషులు ఉంటారు. వారితో సహవాసం చేయటం మంచిది. మనకు అహంభావన పెరుగుతూ ఉంటే గురువుకు దూరమవుతాము, అహంభావన తగ్గుతూ ఉంటే గురువుకు దగ్గరవుతాము. ఎంత ధనం ఉన్నా, చదువు ఉన్నా, ఎన్ని అతీంద్రియశక్తులు ఉన్నా గురువు దయలేకుండా ఆత్మజ్ఞానం కలుగదు అని పెద్దలు చెపుతున్నారు అని అడిగితే ఎన్ని ఉన్నా గురువుయొక్క దయ లేకుండా ఆత్మజ్ఞానము కలుగదు అన్నారు. గురువు అంటే మన హృదయంలో ఉన్న ఆత్మే మన గురువు. మన శరీరం మరణించాక మన బంధువులు, మన స్నేహితులు మనకూడా రారు, కాని మన గురువు మనకూడా వస్తాడు. గురువు మనలను విమర్శించడు, మనలను సరిచేస్తాడు. మిమ్మల్ని పవిత్రులను చేయటానికి, మీచైతన్యస్థాయిని పెంచటానికి ఒకోసారి కష్టాలను పంపిస్తాడు. అది మీమీద ఇష్టంలేక కాదు మిమ్మల్ని బాగుచేయటానికే ఆకష్టాలను పంపిస్తాడు. మీకు కష్టాలు వస్తే కంగారుపడవద్దు, అవి భగవంతుడికి తెలియకుండా రావటంలేదు. మీరు అసూయపరులు అనుకోండి అది గురువుకు తెలుస్తూ ఉంటుంది. నిజమైనగురువు ఏమిచేస్తాడు అంటే మీరు అసూయపరులు అని చెప్పడు. అసూయను పోగొట్టుకోవటానికి మీకు సహకారం అందిస్తాడు. మాకు కోరికలు ఎక్కువగా వస్తున్నాయి అని ఒకసారి భగవాన్‌ను అడిగితే దేహంగా ఉంటే కోరికలు వస్తూనే ఉంటాయి అన్నారు. దేహంగా ఉన్నంతకాలం కామక్రోధములు వస్తాయి. వాటిని నిగ్రహించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. నీవు ఆత్మగా ఉంటే కామక్రోధములు ఉదయించనే ఉదయించవు, ఇంక ప్రయత్నం చేసి తొలగించుకోవలసిన పనీలేదు. రమణమహర్షిగారు జ్ఞాని కదా ఆయన. ఆశ్రమాన్ని కుటుంబానికి ఇవ్వటం ఏమిటి అని ప్రశ్న ఉంది. జ్ఞాని ఇస్తాడు లేకపోతే ఇవ్వడు అడగటానికి నువ్వు ఎవడు ? అది జ్ఞాని దేహప్రారబ్దాన్ని బట్టి జరుగుతుంది. వివేకానంద దేహప్రారబ్దం వేరు, రమణమహర్షి దేహప్రారబ్దం వేరు. జ్ఞాని అంటే ఇట్టివాడు అని చెప్పటానికి అసలు నీకు ఉన్న అర్హత ఏమిటి? రాముడు అవతారపురుషుడు, కృష్ణుడు అవతారపురుషుడు అని మనం అనుకొంటున్నాము. కాని బిహేవియర్ దగ్గరకు వచ్చేటప్పటికి రాముడి బిహేవియర్ వేరు, కృష్ణుడి బిహేవియర్ వేరు.





అది దేహప్రారబ్దాన్ని బట్టి అలా జరుగుతుంది. అంతేగాని లోపల జ్ఞానంలో మటుకు తేడా లేదు.

సత్యమైననేనుకు పరిమితులు లేవు, సత్యమైననేనుకు కాలంలేదు, దేశం లేదు, దేహం లేదు. సత్యమైననేను అనుభవంలోనికి వచ్చినవాడు ఎక్కడఉంటే అదే అరుణాచలం, వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. ఏ హృదయంలో అయితే మిధ్యానేను అణిగిపోతుందో, నేను అనే తలంపు ఎక్కడయితే కాలి బూడిదవుతుందో అక్కడే నీకు సంకల్పశూన్యస్థితి కలుగుతుంది, అదే పరమపదం, అదే విష్ణుపదం. ఏదైతే మనలో నేనుగా వ్యక్తమవుతోందో అది దాని మూలములోనికి వెళ్ళి నశిస్తే అప్పడు విష్ణుపదం పొందుతావు. అప్పడు నీ హృదయంఅంతా ఆనందంతో, శాంతితో నిండిపోతుంది. అప్పడు రూపదృష్టి, నామదృష్టి ఉండదు. భగవంతుడు ఉన్నాడా లేడా అనే తలంపురాదు. రూపచింతన, నామచింతన ఎప్పడైతే పోతుందో అప్పడు మీకు చిరాకు, అశాంతి తగ్గిపోతుంది. ఫలానా శరీరం నాది, ఫలానా పేరునాది అని వాటితో తాదాప్యం పొందవద్దు, ఎక్కడయితే పరమపదం ఉందో ఆహృదయంలోనికి వెళ్ళకుండా మనలను ఆపుచేసేవి రూపచింతన, నామచింతన. మీకు అందుకునే అర్హత లేనప్పడు జ్ఞాని మీ ఇంటికి వచ్చి బోధించినా ప్రయోజనం లేదు.

మనకు కోరికలు ఎప్పడు వస్తున్నాయి. సంకల్పం వచ్చాక కోరిక వస్తుంది కాని సంకల్పం లేకుండా కోరికరాదు. మనం ఎప్పడైతే విష్ణుపదంలోనికి వెళ్ళామో అక్కడ అసలు సంకల్పాలే ఉదయించవు, వచ్చాక నిగ్రహించుకోవటంకాదు. మన దేహపోషణకు సరిపడపని చేసుకొంటూ మిగిలిన కాలాన్ని సత్యాన్వేషణకు ఉపయోగించుకోవాలి. జ్ఞానం దగ్గరకు వచ్చేటప్పటికి మన మార్గాన్ని విడిచిపెట్టకూడదు. ఒక మార్గం మీకు నచ్చినప్పడు అందులో ప్రయాణం చేయండి. అది మంచిది కాదు అని మీ బంధువులు గాని, స్నేహితులు గాని చెప్పినా ఆమాటలు మీరు పట్టించుకోవద్దు. ఆ మార్గం మీకు సుఖంగా ఉన్నప్పడు మీరు వెనుకకు చూడవద్దు. మీ బంధుత్వాలు ఉంటే చూసుకోండి. వారి ఇంటికి మీరు వెళ్ళండి, మీ ఇంటికి వాళ్ళు వస్తారు అంతేగాని జ్ఞానమార్గం దగ్గరకు వచ్చేటప్పటికి రాజీపడవద్దు. మీకు నచ్చినమార్గంలో ప్రయాణం చేయండి, వెనక్కి చూడవలసిన పనిలేదు. మనం చేసే సాధనలు అన్నీ రెండోపక్షం. గురువు యొక్క కృపలేకుండా మనం గురువును పొందలేము. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీ స్వరూపమే. కాని గురుకృప లేకుండా అది నీకు లభ్యం కాదు. గురువుయొక్క దయ ఎలా ఉంటుంది అని అడిగితే అది మాటలకు అందదు, ఊహలకు అందదు, సంకల్పాలకు అందదు, మనస్సుకు అందదు. దానిని నన్ను ఎలా చెప్పమంటావు. మాటలకంటే మౌనం ఎక్కువ సందేశం ఇస్తుంది కాని మౌనసందేశం అందరికి అర్ధంకాదు. నేను ఇక్కడ మౌనంగా కూర్చుంటే సందేశం వస్తుంది కాని అది

మీరు అందుకోలేక పోతున్నారు. అందువలన మాటలు చెప్పవలసి వస్తోంది. జ్ఞాని యొక్క మాట జ్ఞానం, మౌనం జ్ఞానం, చూపు జ్ఞానం, ప్రతీ కదలిక జ్ఞానం, అంతా జ్ఞానమే. మనం ఆడంబరం లేకుండా జీవిస్తే అప్పుడు గురువు యొక్క కృప కలుగుతుంది. ఇప్పుడు మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. ఈ పుట్టుకలు, చావులు అన్నీ అజ్ఞానమనే దీర్ఘనిద్రలో జరిగిపోతున్నాయి., ఇవి ఏమీ నిజంకాదు. గురువు కృప ఎలా ఉంటుంది అంటే ఇప్పుడు మీరు నిద్రలో ఉన్నారు అనుకోండి. ఒక సింహం మీకు స్వప్నంలోనికి వచ్చింది అనుకోండి. ఆ సింహాన్ని చూసి భయం వేసి మనకు మెలుకువ వచ్చేస్తుంది. స్వప్నంలో వచ్చిన సింహం నిజంకాదు, కాని నీకుమెలుకువ రావటం నిజం. గురుకృప కూడా ఆ సింహం చేసిన పనే చేస్తుంది. ఆ సింహం ఏమి చేసింది మామూలు నిద్రలో నుండి నీకు మెలుకువ తీసుకుని వచ్చింది. కాని గురువుయొక్క కృప ఏమి చేస్తుంది అంటే అజ్ఞానమనే నిద్రలోనుండి జ్ఞానంలోనికి తీసుకొని వస్తుంది. నిన్ను అసత్యంలో నుండి సత్యంలోనికి తీసుకొనిరావటానికి గురువు యొక్క ఒక్కచూపు చాలు. గురువు చూపు అంటే అది ఆత్మచూపు. గురువు మీ వంక చూస్తున్నాడు అంటే చూసేది గురువు కాదు. అక్కడ వ్యక్తి కాదు, ఆత్మే చూస్తోంది. మీ హృదయంలో ఉన్న ఆత్మదగ్గరకు తీసుకొని వెళ్ళటానికి ఆత్మేచూస్తోంది. శాంతి పంచుకొంటే తరిగేది కాదు, పంచుకొంటే శాంతి పెరుగుతుంది. పంచుకొంటే పైసాలు తరగవచ్చు కాని పంచుకొంటే జ్ఞానం తరగదు, జ్ఞానం పెరుగుతుంది. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మ వస్తే సరిపోతుందా? జ్ఞానంపట్ల కాంక్ష రావాలి, మహాత్ములతో సహవాసం చేయాలి అనే బుద్ధి రావాలి. పూర్వజన్మలో పుణ్యకర్మలు చేసిఉంటే ఇవి మూడూ వస్తాయిగాని లేకపోతే రావు. ముముక్షత్వం లేనప్పుడు మీకు చెట్లకు తేడా ఏమి ఉంది. చెట్లు పుట్టి, పెరిగి, చనిపోతున్నాయి. జ్ఞానం పొందాలి అనే కాంక్షలేనప్పుడు మీరుకూడా అంతే అన్నారు స్వామీజీ. మీ ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలం ప్రేమను విడిచిపెట్టవద్దు, సేవను విడిచిపెట్టవద్దు. మీ చైతన్యస్థాయిని పెంచుకోవటానికి ప్రేమ అవసరమే, సేవ అవసరమే, మిమ్మల్ని నాన్నగారు అని అందరూ అంటున్నారు. మీలో ఉన్న విశేషం ఏమిటి? అని ఒకరు అడిగారు. నాలో ఏమీ విశేషం లేకపోవటమే విశేషం అని చెప్పాను. నాలో ఏదో విశేషం ఉంది, ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటే వారికి అసలు తియ్యదనం రాదు. మాకు ఎక్కువ భక్తి ఉంది అని మీరు అనుకొంటే సరిపోదు, ఈశ్వరుడు అనుకోవాలి. భక్తి వలన నీ బుద్ధి ఎంతవరకు పక్వానికి వచ్చిందో ఆయన చూస్తాడు. నీకు మెచ్యూరిటీ వచ్చినప్పుడు ఆయన నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీరు ఏ విషయాలను ఎంజాయ్‌చేస్తున్నారో భగవంతుడు చూస్తూ ఉంటాడు. మీరు లోకవిషయాలు ఎంజాయ్‌చేస్తూఉంటే మిమ్మల్ని ఆయన దగ్గరకు తీసుకోడు. మనం భగవంతుడిని మోసం చేయలేము. నీవు భగవంతుడినే ఎంజాయ్‌చేస్తూఉంటే, నీవు పక్వానికివస్తే నీ ఒక్కడికోసం శరీరం ధరించి నిన్ను రక్షించటానికి వస్తాడు. మనం ఇంకొకటినేర్చుకోవాలి. మీకు విరోధులు అయినవారి దగ్గర జ్ఞానం ఉంటే, వారి దగ్గర ఏదైనా వైభవంఉంటే మనం ఆనందించటం నేర్చుకోవాలి. మీ దేహభావన తగ్గిస్తూ, మీలో ఆత్మభావన పెంచుకొంటూ వస్తాడు, వాడు గురువు. మీతో తిరుగుతాడు, మీతో కలసి తింటాడు కాని ఆయన వచ్చిన పనివేరు. మీ అజ్ఞానాన్ని తీసుకొని వారి జ్ఞానాన్ని ఇవ్వటానికి వచ్చాడు, అది చూసుకొంటూ ఉంటాడు. ఈలోపు మీరు చెప్పిన మాటలు వింటాడు. మీరు పెట్టినది తింటాడు కాని ఆయన పనిమర్చిపోడు. సాధన పేరు మీద మీకు బాధలేకుండా సిద్ధిని ప్రసాదిస్తాడు. ఏ హృదయంలో అయితే ఆనందం ఉందో, మధ్యవర్తులతో సంబంధంలేకుండా డైరెక్టుగా ఆ హృదయగుహలోనికి మిమ్మల్ని తీసుకొని పోవటానికి వచ్చిన అవతారమే భగవాన్. గాంధీ మనలాగే ఈ భూమి మీద పుట్టాడు గాని ఈ భూమికి సంబంధించిన కాంక్ష ఏమీలేదు, అధికారం మీద కాంక్షలేదు. ఆయన చాలా తక్కువ మాట్లాడేవాడు. భారతదేశంతో, భారతజాతితో తాదాప్యం పొందాడు. దేశంగౌరవం ఆయన గౌరవం, దేశం అగౌరవం ఆయన అగౌరవం అలా దేశంతో తాదాప్యం పొందాడు. మనం దేవుడిని ఎలా ఆరాధిస్తామో అలాగే ఆయన దేశాన్ని ఆరాధించాడు, దేశంకోసం మాట్లాడాడు, దేశంకోసం ప్రార్థించాడు, దేశంకోసం ఉపవాసాలు చేసాడు. ఆయనకు కామన్‌మేన్‌తో తాదాప్యం, అందువలననే తుండుగుడ్డలు కట్టుకొన్నాడు, ఆయనకు కట్టుకోవటానికి చొక్కాలేకకాదు. అందుచేత గాంధీగారు మహాత్ముడు అయ్యాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 19-2-2003, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పొందవలసిన వస్తువు మనహృదయంలోనే ఉంది. అది ఎక్కడో కైలాసంలో ఉంది, వైకుంఠంలో ఉంది అని మనకు అనిపిస్తుంది కాని అది ఇక్కడే మన హృదయంలోనే ఉంది. ఇక్కడనుండి మనం కాశీ, రామేశ్వరం, షిరిడీ ఇలా వేలాది మైళ్ళు దూరం వెడుతున్నాము. మన తలకాయకు, హృదయానికి పెద్ద దూరంలేదు, రెండుజానల దూరం ఉంది, ఈ రెండుజానల దూరం వెళ్ళలేకపోతున్నాము, దానిని పొందలేకపోతున్నాము. ఇదే మాయ. మీరు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా ధ్యానమార్గంలో ప్రయాణం చేసినా, మీరు ఏగురువును ఆశ్రయించినా, మీరు ఏరూపాన్ని ధ్యానంచేసినా ఏనామాన్ని స్మరించినా మీరు పొందవలసింది హృదయంలోనే పొందాలి, అది మర్చిపోవద్దు. మనం నేను నేను అంటాము. అది ఒక తలంపు. మొత్తం సంసారం